క్లుప్తంగా

నేడు రెండు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డతీగల: రంపచోడవరం మండలం బీరంపల్లి వద్ద ఎన్‌హెచ్–516ఇ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అడ్డతీగల, వై.రామవరం మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ మహ్మద్ యూసఫ్ తెలిపారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా విద్యుత్‌లైన్ల ఏర్పాటుకుగాను సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి వినతి


ఎమ్మెల్సీ అనంతబాబుకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

చింతూరు: తమ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం చింతూరులో ఆయనను కలసి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు బలరాం, గౌతమ్‌రాజు, పండా రఘు, వినోద్, గీతాంజలి, భారతి పాల్గొన్నారు.

అందరికీ ఇళ్లు... ప్రభుత్వాల లక్ష్యం


అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ సిబ్బంది

కొయ్యూరు: అందరూ ఇళ్లు కలిగిఉండాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని కొయ్యూరు పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు తెలిపారు. బూదరాళ్లలో మంగళవారం ఆవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వాలు ఇళ్లు మంజూరు చేస్తున్నాయని చెప్పారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

76 మందికి నేత్రవైద్య పరీక్షలు


పెదబయలు నుంచి రిఫర్ చేసిన రోగులతో వైద్యాధికారులు

పెదబయలు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిశోర్ తెలిపారు. పెదబయలు పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన వారికి మంగళవారం విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పరీక్షలు చేసినట్టు చెప్పారు. శస్త్ర చికిత్స కోసం 15 మందికి ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు రిఫర్ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిందూరం పడాల్, వైద్య సిబ్బంది డి.వెంకటరావు, వి.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా


చెక్కు అందజేస్తున్న ఎంపీపీ రాజుబాబు, ఎంపీడీవో వెంకటరావు

హుకుంపేట: బాకురు పంచాయతీ గొప్పుల పాలెం గ్రామానికి చెందిన చెదల పైడన్న అనే కల్లుగీత కార్మికుడు ప్రమాదవశాత్తు జూన్ నెలలో చెట్టు నుంచి జారిపడి మృతి చెందాడు. దీంతో ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ.5లక్షల చెక్కును స్థానిక ఎంపీపీ కూడా రాజుబాబు మంగళవారం మృతుడి భార్య రాజులమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు,వైఎస్సార్ బీమా డీపీఎం రమణి,వెలుగు ఏపీఎం చిన్నారావు, బాకురు సర్పంచ్ బాకురు వెంకటరమణ పాల్గొన్నారు.



దారులు రయ్..రయ్ మంటూ అభివృద్ధి చెందుతున్నాయి... అద్దంలా ఉన్న తమను తాము చూసుకుని రోడ్లు మురిసిపోతున్నాయి ...కొండల మధ్య మెలికలు తిరుగుతూ కిలోమీటర్ల పొడవునా నల్లగా ఉన్న ఆ మార్గాల వెంట ప్రగతి పరుగులు తీస్తోంది. రోడ్లతో పాటు బతుకులు బాగుపడడంతో ఇన్నాళ్లకు మా 'దారి'ద్ర్యం తీరిందని మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నా పేరు ముదిలి విజయ్. మాది బుంగాపుట్టు పంచాయతీ కొండగాబుల గ్రామం. మా అమ్మ తులసికి గత ఏడాది జర్వం వస్తే ఏడు కిలోమీటర్ల మేర గెడ్డలు, కొండలు ఎక్కి రహదారి సౌకర్యం ఉన్న లక్ష్మీపురం వరకు డోలీలో తీసుకువెళ్లి అక్కడ నుంచి అంబులెన్స్‌లో లబ్బూరు ఆస్పత్రికి తీసుకెళ్లాం. పరీక్షలు చేసి, టైపాయిడ్ జర్వం అని వైద్యులు తెలిపారు. సకాలంలో తీసుకుని రావడంతో జ్వరం తగ్గిందని, లేకపోతే టైఫాయిడ్ ఎక్కువై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండేదని చెప్పారు. కానీ ప్రస్తుతం మా గ్రామానికి రహదారి వేయడంతో గ్రామంలోకే వాహనాలు వస్తున్నాయి.వైద్యులు సైతం వచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. రోగులను ఆస్పత్రులకు మోసుకొని వెళ్లే పరిస్థితి పోయింది. నేను కూడా బైకును కొనుక్కున్నాను.నడకబాధ లేకుండా రాకపోకలు చేస్తున్నాను.75 సంవత్సరాల తరువాత మా కొండగాబుల గ్రామానికి రహదారి సమస్య తీరింది.

ప్రగతి మార్గాలు


భూసిపుట్టుకు వేసిన బీటీ రోడ్డు



మండలం : ముంచంగిపుట్టు	
పంచాయతీలు	: 23
నిర్మించిన బీటీ రోడ్లు	: ఏడు
కిలో మీటర్లు	: 136
వ్యయం	: రూ. 75.94 కోట్లు
రోడ్డు సౌకర్యం ఏర్పడిన గ్రామాలు	: 144

ముంచంగిపుట్టు: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్నా ఆ గ్రామాలకు పక్కా రహదారి సౌకర్యం లేక ఇన్నాళ్లు గిరిజనులు ప్రయాణానికి పడరాని పాట్లు పడ్డారు. తీవ్ర అనారోగ్య బారిన పడినా రహదారి అధ్వాన పరిస్థితిలో ఉండడంతో సకాలంలో ఆస్పత్రికి చేరలేక మార్గమధ్యలోనే రోగులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం. అదంతా గతం ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాలకు పక్కా రహదారులు నిర్మించారు. రవాణా సౌకర్యం మెరుగుపడింది. గత నాలుగేళ్లలో 144 గ్రామాలకు రూ.75.94 కోట్లతో 136 కిలో మీటర్లతో తారురోడ్లు వేశారు.

- మండలంలో అత్యంత మారుమూల ఒడిశా సరిహద్దులో ఉన్న భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేక ఎంతో వ్యయప్రయాసలతో 15 కిలో మీటర్లు ప్రయాణం సాగించేవారు. వర్షాకాలం నాలుగు నెలలు అయితే భూసిపుట్టు పంచాయతీలో ఉన్న గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో పీఆర్ ప్రాజెక్టు ద్వారా పెదబయలు మండలం రూడకోట జంక్షన్ నుంచి భూసిపుట్టు పంచాయతీ కేంద్రం మీదగా ఒడిశా సరిహద్దు వరకు 26 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 15.40 కోట్లు మంజూరు చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడం ఈ రోడ్డు పనులు జరగకపోవచ్చు అని అందరూ భావించారు. కానీ పక్క రహదారిని అధికారులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు.
- మారుమూల రంగబయలు పంచాయతీ కేంద్రానికి పీఆర్ ప్రాజెక్టు ద్వారా రూ.16.90 కోట్లు మంజూరు చేశారు. వనుగుమ్మ పంచాయతీ అసరాడ ఆర్ అండ్‌బీ రహదారి నుంచి రంగబయలు పంచాయతీ జోడిగుమ్మ వరకు 18 కిలో మీటర్ల రహదారి పనులు శరవేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. రవాణా కష్టాలు తీరడంతో ఆ ప్రాంత గిరిజనుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.
- మండలంలో గల బుంగాపుట్టు పంచాయతీ కేంద్రానికి లబ్బూరు జంక్షన్ నుంచి 28 కిలోమీటర్ల రోడ్డును రూ.13.94 కోట్లతో నిర్మించారు. ఈ మార్గంలో బిరిగూడ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.3.55 కోట్లు మంజూరు చేసింది.వంతెన పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.
- కుమడ పంచాయతీ ముక్కిపుట్టు జంక్షన్ నుంచి కిందుగూడ గ్రామానికి రూ. 3.85 కోట్లతో, మండల కేంద్రం నుంచి సుజనకోట పంచాయతీ కేంద్రానికి రూ.1.95 కోట్లతో తారు రోడ్లు, పెదగూడ పంచాయతీ కేంద్రం నుంచి జర్రిపడ,వెచ్చంగిపుట్టు గ్రామాలకు రూ.1.90 కోట్లతో తారురోడ్డు నిర్మించారు. కుజభంగి జంక్షన్ నుంచి ముంచంగిపుట్టు మండల కేంద్రం మీదగా దుడుమ వరకు ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ. 22కోట్లతో 35కిలో మీటర్ల రహదారి విస్తరణ చేశారు.

శరవేగంగా పనులు

ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో నూతన రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 28కోట్లతో 42కిలో మీటర్ల రహదారి పనులు జరగుతున్నాయి.దీంతో 58 గ్రామాలకు రహదారి సమస్య తీరనుంది.

కొత్తగా ప్రతిపాదనలు

మండలంలో రూ. 24కోట్లతో 40కిలో మీటర్ల రహదారుల నిర్మాణానికి ప్రాతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే 37 గ్రామాలకు రహదారి సమస్య తీరుతుంది.తాజాగా లక్ష్మీపురం పంచాయతీ సంగంవలస గ్రామం నుంచి రంగబయలు పంచాయితీ గొబ్బరపడ,బుడపనస గ్రామాల మీదగా జోడిగుమ్మ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.19.16కోట్లు మంజూరు చేసింది.

పంచాయతీల వారీగా రోడ్డు సౌకర్యం ఏర్పడిన గ్రామాలు

పంచాయతీలు	గ్రామాలు				
బుంగాపుట్టు	18	జర్రెల	04	జోలాపుట్టు	04
లక్ష్మీపురం	06	కర్రిముఖిపుట్టు	05	పనసపుట్టు	03
బూసిపుట్టు	20	జర్జుల	03	పెదగూడ	04
బాబుశాల	08	కుమడ	08	కిలగాడ	05
రంగబయలు	17	బంగారుమెట్ట	06	దోడిపుట్టు	06
వనుగుమ్మ	05	ఏనుగురాయి	05	మాకవరం	03
సుజనకోట	02	దార్రెల	06	బరడ	02
		వనభసింగి	01	కించాయిపుట్టు	03


మజ్జిగూడ గ్రామానికి నిర్మిస్తున్న రోడ్డు


బిరుగూడ వాగు వద్ద నిర్మిస్తున్న వంతెన

వ్యయప్రయాసలు తగ్గాయి



గతంలో సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పదుల కిలో మీటర్ల మేర గెడ్డలుదాటి,కొండలు ఎక్కి ప్రయాణం సాగించేవారం. మా రవాణా కష్టాలు వర్ణనాతీతం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీటీ రోడ్డు మంజూరు అవడం, రహదారి పనులు పూర్తి కావడంతో వ్యయ ప్రయాసలు తగ్గాయి.

– కిల్లో మెత్తి, జర్రిపడ గ్రామం,పెదగూడ పంచాయతీ

రూ.19 కోట్లతో ప్రతిపాదనలు

సుమారు రూ.45 కోట్లతో రహదారి పనులు జరిగాయి. మరో రూ.20 కోట్లతో పనులు జరుగుతున్నాయి. రూ.19 కోట్లతో మరికొన్ని నూతన రహదారులకు ప్రాతిపాదనలు పంపాం.అవసరమైన చోట్ల కల్వర్టులు, వంతెనల నిర్మాణాలకు ప్రాతిపాదనులు సిద్ధం. రహదారులు పనుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నాం

– సంతోష్, పీఆర్ ఏఈ ప్రాజెక్టు, ముంచంగిపుట్టు

గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలు విస్తృతం చేయాలి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలను మరింత విస్తృతం చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సూచించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద నిర్వహిస్తున్న గ్రామీణ వికాస్ బ్యాంక్‌ను నూతన భవనంలోకి మంగళవారం మార్చారు. నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గ్రామీణ వికాస బ్యాంకు సేవలు గిరిజనులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, అనకాపల్లి గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్, డీవోజీబీ నాగరాజు, బ్రాంచి మేనేజర్ వినోద్, ఫీల్డ్ అధికారి రామకృష్ణ, వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ సంపత్ కుమార్, సీనియర్ నాయకులు శెట్టి అప్పాలు,సాంబ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి నిత్య కుటుంబాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మంగళవారం పరామర్శించి, ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. నిత్య తల్లిదండ్రులకు రూ.15 వేల ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, సర్పంచ్ సింహాచలం, ఎంపీటీసీలు బాబురావు, పద్మ, కో ఆప్షన్ సభ్యుడు నాజర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌కుమార్‌కు ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ్‌కుమార్‌ను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ నేతలు మంగళవారం చిన్నలబుడులో పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పార్టీ పరంగా అన్నివిధాలుగా అండగా ఉంటామని, మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ పట్టాసీ సంపత్‌కుమార్, మండల నాయకులు ముఖి సాంబ,రంజిత్‌కుమార్, రామరావు, నర్సింగ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేతో గిరిజనులకు మేలు


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం

హుకుంపేట: భూ రీసర్వేతో గిరిజనులకు మేలు జరిగిందని ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలో ఉర్రాడ, తియనిపుట్టు, బిలాయిపుట్టు, జోగులపుట్టు గ్రామాల గిరిజనులకు రీ సర్వే ద్వారా మంజూరైన భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ రీ సర్వేతో భూ వివాదాలు పరిష్కారమయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు,ఆర్ఐ సీతమ్మ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల సేవలు సద్వినియోగం

ముంచంగిపుట్టు: మండలంలోని ఎనిమిది గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. కించాయిపుట్టు, సుజనకోట, కిలగాడ, మాకవరం, వనుగుమ్మ, బుంగాపుట్టు, లక్ష్మీపురం, బూసిపుట్టు గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

కుల గణనపై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

కొయ్యూరు: మండలంలో ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న కులగణ ను పకడ్బందీగా నిర్వహించాలని, పూర్తి వివరాలు నమోదు చేయాలని ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో లాలం సీతయ్య, తహసీల్దారు తిరుమలరావు ఆదేశించారు. కుల గణనకు సంబంధించి మంగళవాం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సంక్షేమ సహాయకులు, వీఆర్‌వోలు, వలంటీర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా యాప్‌లో వివరాలు నమోదు చేయాలని చెప్పారు. వచ్చేనెల 9వ తేదీ వరకు కులగణన సర్వే ఉంటుందని తెలిపారు.

కాఫీ రైతులకు న్యాయం చేయండి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: జాతీయ రహదారి 516ఈ నిర్మాణంలో వంజరి పంచాయతీ కేంద్రానికి సంబంధించి ములకాయపుట్టు, గెమ్మెలి పంచాయతీ వరిగెలపాలెం, కడగెడ్డ గ్రామాలకు చెందిన 85 మందికి చెందిన కాఫీ రైతులకు నష్టం జరిగిందని మంగళవారం ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వారికి న్యాయం చేయాలని, భూములు కోల్పోయినవారికి తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ


రగ్గులు పంపిణీ చేస్తున్న, ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్

మారేడుమిల్లి: ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్ మండలంలోని బోదులూరులో వృద్ధులకు రగ్గులు, పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల సేవా గుణం కలిగి ఉండాలన్నారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), దూడ విక్టర్ బాబు, సుందర్ పాల్ పాల్గొన్నారు.

అనంతగిరి: వాలసీ పంచాయతీ కేంద్రంలోని గురు చైతన్య ధామం గురువు డి.గోవిందరావు ఆధ్వర్యంలోని నిరుపేద గిరిజనులకు మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం సత్యసాయి జయంతి వేడుక నిర్వహించారు. మాతృభూమి సేవాసంస్థ వైద్య శిబిరం నిర్వహించి, గిరిజనులకు మందులను ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ,నగేష్, విశ్వహిందూపరిషత్ ప్రతినిధి చిన్న, సాయి, చందరరావు, నరసింగరావు పాలొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

వీఆర్‌పురం మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఫణేంద్ర

వీఆర్‌పురం: మండలంలో నెలకొన్న సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ కారం లక్ష్మి అధ్యక్షత జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.

వర్షాభావ పరిస్థితుల వల్ల వందల ఎకరాల్లోని వరి పంట ఎండిపోయిందని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రేషన్ దుకాణాల్లో కందిపప్పు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని రేఖపల్లి ఎంపీటీసీ సభ్యురాలు వంధం విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. చింతరేగుబల్లిలో వ్యవసాయ మోటర్లకు విద్యుత్‌సౌకర్యం కల్పించి రైతులను ఆదుకోవాలని సర్పంచ్ పిట్టా రామారావు కోరారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, సమస్యల పరిష్కారంపై కూడా అధికారులు శ్రద్ధచూపాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి తెలిపారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులు పనుల పురోగతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, వైస్‌ఎంపీపీ ముత్యాల గంగాభవాని, ఎంపీడీవో ఆర్.ఫణేంద్ర, డీటీ రామకృష్ణ, వైద్యా.దికారి ధనలక్ష్మి, ఎంఈవో వి.వి.లక్ష్మీనారాయణ,పీఆర్ ఏఈ రామకృష్ణారెడ్డి, ఈజీఎస్ ఏపీవో రాఘవయ్య, వెలుగు ఏపీఎం కిషోర్ , ఎంపీటీసీలు బంధం విజయలక్ష్మి, మిడియం రమాదేవీ, పూనెం ప్రదీప్, సర్పంచ్‌లు పిట్టా రామారావు, పూనెం సరోజినీ, మూట్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

ఎంపీపీ శెట్టి నీలవేణి


మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. కొన్నిశాఖల అధికారులు గైర్హాజరవడంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు.

మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి కూడా అధికారులు రాకపోతే అభివృద్ధి ఎలా జరుగుతుందని ఎంపీపీ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గంగరాజు, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, ఎంపీడీవో శ్రీహర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

ఎటపాక: ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా సీతాపురంలో మంగళవారం ఉచితంగా ఇండేన్ గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పెరమయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 185 మందికి గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. రాష్ట్రకిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి నోముల రామారావు, పాయం వెంకయ్య, దుర్గారావు, శాంతకుమారి, రమేష్, వెంకటసాయి, రామకృష్ణ పాల్గొన్నారు.